# లొంగిపోయిన మావోయిస్టుల దారెటు..?

డా.కాచం సత్యనారాయణ

**భారతదేశంలో నక్సలిజం ఇక చరిత్రగా మిగిలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సగం రాష్ట్రాలకు విస్తరించి ప్రభుత్వాలను కుదిపేసిన నక్సలైట్ గ్రూపులు, ముఖ్యంగా మావోయిస్టు దళాలు ఇప్పుడు క్రమంగా బలహీనపడుతూ ఉనికిని కోల్పోతున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో అనేక మంది మావోయిస్టులను తుడిచి పెట్టేస్తున్నారు." దీంతో దేశంలో మావోయిస్టుల ఉనికి ఇక ప్రశ్నార్థకమేనా? అంటే ఇప్పటివరకు జరిగిన అగ్ర నేతల లొంగుబాటుతో అవుననే సమాధానం వస్తోంది.**

ఇప్పటికే అగ్ర నేత దేవ్‌జీ లొంగిపోగా, 50 ఏళ్ల దండకారణ్యంలో మగ్గిన గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వసంత మేఘంలా ఘర్జించిన విప్లవ స్వరం ఇప్పుడు లొంగుబాటు ప్రకటనల మౌనంగా మారింది.కాంగ్రెస్ పాలనలోనే 'ఎన్ కౌంటర్' లు మొదలైనప్పటికీ, బీజేపీ పాలనలో అవి తారాస్థాయికి అందుకున్నాయి. మావోయిస్టులను ప్రత్యక్షంగా చంపివేయడానికి కేంద్ర ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ వంటి పేర్లతో మావోయిస్టుల ఏరి వేత మొదలుపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వంతో పోల్చుకుంటే, పన్నెండేళ్ళ క్రితం కేంద్రంలో అధికారం లోకొచ్చిన హిందుత్వ వాద బిజేపి ప్రభుత్వం నేటి మావోయిస్టు పార్టీ పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఏడాది క్రితం 'కగార్' ఆపరేషన్‌ను ప్రారంభించిన కేంద్రం, ఈ ఏడాది మార్చి 31 కల్లా మావోయిస్టు రహిత భారతదేశాన్ని ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. అందులో విజయవంతమైందనే చెప్పాలి.

భూమి కోసం, భుక్తికోసం ఉద్భవించిన తెలంగాణా సాయుధపోరాటం నిజాం పాలనను అంతమొందించింది. ప్రజలు కోరిన భూమి సమస్యను పరిష్కరించకుండా, నిజాంను రాజ్ ప్రముఖ్‌గా చేసి, అతని ఆధ్వర్యంలోనే నాటి ప్రభుత్వం వేలసంఖ్యలో కమ్యూనిస్టులను చంపేసింది. భూమి సమస్య వల్లనే 1967లో నక్సల్ బరీ ఉద్యమం తలెత్తింది. సాయుధ పోరాట మార్గంతో 1969లో ఏర్పడిన సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలోశ్రీకాకుళ రైతాంగ ఉద్యమంగా ఊపందుకుంది.ఈఉద్యమంలో పాల్గొన్న విప్లవకారులను ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేయడం మొదలు పెట్టింది. అదే సమయంలో తెలంగాణా ప్రాంతంలో కూడా లెక్కలేనన్ని 'ఎన్‌కౌంటర్లు'జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపట్టిన భూసంస్కరణలు, ప్రజల మౌలికమైన భూమి సమస్యను పరిష్కరించలేకపోయింది. అత్యధిక ప్రజల జీవనాధారం భూమి కావడంతో, భూమి కోసం అనేక మంది యువకులు ప్రాణాలను లెక్కచేయకుండా సాయుధ పోరాట పంథాను అనుసరించారు. సిపిఐ(ఎంఎల్) పీపుల్స్ వార్ 1980లో ఏర్పడి, ప్రజలకు సాయుధ మద్దతుగా నిలబడింది. తెలంగాణా గ్రామాల్లో 'నీ బాంచెన్ దొర' ' నీ కాల్మొక్త దొర' అనే స్థాయి నుంచి, భూస్వాములకు వ్యతిరేకంగా ఎదురొడ్డేలా ప్రజలకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించ గలిగింది. ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా, ఎంత మంది యువకులను, నాయకులను పోగొట్టుకున్నా, పోలీసులు, ప్రభుత్వాధికారులు, పెత్తందార్ల దౌర్జన్యాలను పీపుల్స్ వార్ చాలా మటుకు నిలువరించగలిగింది. పీపుల్స్ వార్ దెబ్బకు కొందరు భూస్వాములు గ్రామాలను వదిలిపెట్టి నగరాలకు, పట్టణాలకు వలస వెళ్ళారంటే, ఆ ఉద్యమం ఎంత బలంగా పాదుకుందో వేరే చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో పీపుల్స్ వార్‌తో చర్చలు కూడా జరిపింది. ఆ చర్చల చివరి రోజునే పీపుల్స్‌వార్ కాస్తా మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించింది. దేశంలో తాడిత పీడిత ప్రజల కోసంఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలిచింది. దొరలు, పెత్తందారుల రాక్షసత్వానికి నలిగిపోయిన బాధకు గురైన బడుగు బలహీన వర్గాలు, విద్యావంతులు, మేధావులు, యువత అడవి బాట పట్టారు. గిరిజనులు, ఆదివాసీలు నిరుపేదలకు రక్షణగా తుపాకులతో పహారాకాశారు. తమ జీవితాలను త్యాగం చేసి, ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. పేద ప్రజలను పట్టి పీడిస్తున్న దోపిడీ పెత్తందారుల నుంచి విముక్తి కల్పిస్తూ అనేక మిలిటెంట్ ఉద్యమాలు చేశారు. ఈ ఉద్యమాల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మంది అమరులయ్యారు.

నానాటికీ పెరిగిపోతున్న సాంకేతికత, మారిపోతున్న నాగరికత మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. దండకారణ్యం అబూజ్‌మడ్ అడవుల్లో తల దాచుకున్న మావోయిస్టులకు శాస్త్ర పరిజ్ఞానం యమపాశంగామారింది. ఒక వైపు అంతరించిపోతున్న అడవులు, పెరిగిపోయిన సాంకేతికత, ప్రజల నుంచి ఆశించినంత ఆదరణ లేకపోవడంతో మావోయిస్టు ఉనికి ప్రమాదంలో పడింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌కు తెరలేపింది. దేశంలో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలు అయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర అడవుల్లో కేంద్ర బలగాలు సాంకేతికతను ఉపయోగించి మావోయిస్టుల ఏరివేతను లక్ష్యంగా పెట్టుకున్నాయి. జన జీవన స్రవంతిలో కలిసిపోతున్న మావోయిస్టులు : కేంద్ర బలగాలు అడవిలోకి వెళ్లి క్యాంపులు ఏర్పాటు చేసుకుని, ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మందిని తుదముట్టించింది. ఒకవైపు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ప్రతీకార చర్యలు, మరోవైపు ప్రజల నుంచి ఆదరణ కరవు, అడవులు అంతరించిపోతుండటం మావోయిస్టులను ఆలోచనలో పడేశాయి. ప్రజల్లో స్వార్థ ప్రయోజనాలు పెరిగినందున, అడవిని వీడి జనం బాట పట్టాలని మావో యిస్టు కేంద్ర కమిటీలో తీవ్ర చర్చ జరిగింది.దీనిని కొంత మంది స్వాగతించగా, మరి కొంత మంది వ్యతిరేకించారు. తాజా పరిణామాలనేపథ్యంలోవేలాదిమంది మావోయిస్టులు లొంగిపోయారు. మల్లోజుల వేణు గోపాల చారి, దేవ్ జీ లాంటి అగ్ర నేతలు లొంగిపోగా, హిడ్మా ఎన్‌కౌంటర్‌లోహతం అవడంతో అడవుల్లోని అన్నలు ఆయుధం వీడి ఓటు అనే వజ్రాయుధంలో బుద్ధి చెప్పాలని సంకల్పించి పెద్ద ఎత్తున జన జీవన స్రవంతిలో కలిసిపోయారు.మావోయిస్ట్ పార్టీ ఉద్యమ అగ్రనేత గణపతి సైతం తొందరలోనే ఢిల్లీలో లొంగిపోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గణపతి లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసినట్లే నని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఉద్యమాన్ని నడిపించిన కీలక నేతలు, వేలాది మంది లొంగిపోయిన మావోయిస్టులు ప్రజా స్వామ్య పద్ధతిలో ప్రజల పక్షాన నిలబడిపోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వేదిక నుంచి పిలుపునిచ్చారు. వారందరినీ కలిసికట్టుగా అందరం కూర్చొని నిర్ణయాలు తీసుకుని ప్రజల పక్షాన పోరాటం చేద్దామని సూచించారు. మరో వైపు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దేవ్‌జీ లాంటి అగ్ర నేతలతో రాజకీయ ఎజెండాతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరాలనుకునే లొంగిపోయిన మావోయిస్టులుపీసీపీ చీఫ్‌ను సంప్రదించాలని కోరారు. మావోయిస్టు ఉద్యమాన్ని అర్ధ శతాబ్దం పాటు నడిపిన అగ్ర నాయకులు అత్యంత విద్యావంతులు, మేధావులు కావడం, నిస్వార్థ ప్రయోజనాలు కలిగి ఉండటం తమ పార్టీకి బలం చేకూరుతుందని రాజకీయ పార్టీలు అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తంగా లొంగిపోయిన మావోయిస్టులు రాజకీయాల్లోకి వస్తారా? వస్తే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరతారా? లేక కొత్త పార్టీ ఏమైనా పెడతారా? వేచి చూడాలి.

## శవాలపై పేలాలు ఏరుకుంటున్న యుద్ధ పరిశ్రమ

దేశాల మధ్య వివాదాలు, పంచాయితీలే యుద్ధ పరిశ్రమకు ముడి సరుకులు. వివాదాలు, పంచాయితీలు, శతృత్వాలే ఉంటేనే ఆయుధ కొనుగోలుదారులు ఉంటారు కదా. దేశాల మధ్య ఏవో సమస్యలు, వివాదాలు ఉండాలి. లేకుంటే ఎలాగైనా వివాదం రగిలించాలి.దానిని పంచాయితీగా మార్చాలి. దానిని శత్రుత్వంగా మార్చి వేయాలి. అలా ఆ దేశాలకు ఆయుధాల అవసరం కల్పించాలి. అప్పుడు ఆ దేశాలు ఆయుధాలు కొనుగోలు చేయక తప్పనిస్థితి ఏర్పడుతుంది. అలా దేశాలు కొనుగోలు చేసి ఆయుధాలతో యుద్ధాలు చేస్తూ చితి మంటల్లో కొట్టుకు చస్తుంటే యుద్ధ (ఆయుధ) పరిశ్రమ జేబులు నింపుకోవచ్చును.ఎన్ని యుద్ధాలు జరిగితే ఆయుధాలకు అంత గిరాకీ. అందుకే ప్రపంచం ప్రశాంతంగా ఉండడానికి వీలు ఉండకూడదు. ఏ వివాదమూ లేకుంటే యుద్ధ పరిశ్రమ మనుగడే దెబ్బ తింటుశీది కదా. అందుకే ప్రపంచం ప్రశాంతంగా ఉండకూడదు. నిత్యం యుద్ధాలు జరుగుతూనే ఉండాలి.ఎన్ని యుద్ధాలు జరిగితే పరిశ్రమకు అంత లాభం. అలాంటి స్థితిలోనే ఆయుధాల ఉత్పత్తులు అమ్ముకోవచ్చును.మరింత ఉత్పత్తికి అవకాశాలను మెరుగు పరచుకోవచ్చును. అలా ఆయుధాలను అమ్ముకొని జేబులు నింపుకోవచ్చును. శవాలపై పేలాలు ఏరుకొని తద్దినపు తిండిని కడుపు నిండా ఆరగించి సొమ్ము చేసుకోవచ్చును. రష్యా- ఉక్రెయిన్ ల మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం, అమెరికా ఇజ్రాయిల్ లు కలిసి ఇరాన్ పై చేస్తున్న ఏకపక్ష యుద్ధాలతో పరిశ్రమకు చేతి నిండా పని లభించింది. దీంతో రాత్రి పగలు శ్రమిస్తూ వినూ త్న విధ్వంసక ఆయుధాలను తయారు చేయడంలో తలమునకలై పోయాయి ఆయుధ కర్మాగారాలు. అప్పట్లో ఇరాన్- ఇరాక్ మధ్య పదేళ్ల యుద్ధంతో పరిశ్రమ లాభాల పంట పండింది.అప్పట్లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ చేసి సృష్టించిన విధ్వంసంలో లాభాల పంట బాగా పండించుకుంది పరిశ్రమ. ప్రజాస్వామ్య స్థాపన పేరిట ఆఫ్ఘనిస్తాన్ ను అమెరికా ఆక్రమించి 20 యేళ్ల పాటు ఆ దేశాన్ని అరాచకాల పాల్జేసి చివరికి తాలిబన్లకు వదిలేసి వచ్చిన ఉదంతంలో కూడా లాభాల పంట పండించు కుంది పరిశ్రమ.ప్రపంచంలోని వంద ప్రముఖ ఆయుధ కర్మాగారాలు ఒక్క 2024 సంవత్సరంలోనే 679 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించ గలిగాయి. అలా ఆయుధ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతున్నది.ప్రతి యేటా యుద్ధ పరిశ్రమ సుమారు ఆరు శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంటున్నదట.2035 నాటికి యుద్ధ పరిశ్రమ అరున్నర లక్షల కోట్ల డాలంలకు చేరుకుంటుందని ఒక అంచనా. ఒక్క 2022 సంవత్సరంలోనే యుద్ధాలపై మొత్తం ప్రపంచం చేసిన ఖర్చు మూడు లక్షల కోట్ల డాలర్లు. ఒక్క అమెరికానే 2023 లో 2.38 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రపంచంలో అత్యధిక ఆయుధాలు ఉత్పత్తి చేసేది అమెరికానే.అమెరికా తరువాత రష్యా, ఫ్రాన్స్, చైనా, జర్మనీ దేశాలు అత్యధిక ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఆయుధ కంపెనీల యజమానులకు ఈ దేశాల ప్రభుత్వాలతో మంచి సంబంధాలు ఉన్నాయి ఉంటాయి. ప్రభుత్వాల్లో ఎవరున్నా, ఏ పార్టీ ఉన్నా వాటి సంబంధాల్లో మార్పులు ఏమీ ఉండదు. ప్రభుత్వాలు పరిశ్రమకు మధ్య పరస్పర బంధం అంత బలమైనది. ఆ సంబంధాలతో దేశాల మధ్య యుద్ధాల సృష్టికి కుట్రలు పన్నుతూ ఉంటాయి. ఆయా దేశాల గూఢాచార సంస్థలు అందుకోసమే పని చేస్తాయి. అలా ప్రపంచ యుద్ధ పరిశ్రమ తుపాకులు మిసైళ్లు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ విమానాల, హెలికాప్టర్లు, యుద్ధనౌకలు, బాంబులు వేసే డ్రోన్లు, తదితరాల తయారీలో పూర్తిగా తలమునకలై పోయి ఉన్నాయి. సరికొత్త విధ్వంసక ఆయుధాల తయారీ కోసం వాటి పరిశోధనశాలలు పని రేయిశీబవళ్లు పని చేస్తూనే ఉంటాయి. గాజాపై ఇజ్రాయిల్ ఇటీ వల ముగించిన యుద్ధంతో దండిగా సొమ్ము చేసుకుంది యుద్ధ పరిశ్రమ. ఇరాన్ పై ఇప్పుడు కొనసాగుతున్న యుద్ధంతో పండగ చేసుకుంటున్నది ఆ పరిశ్రమ.

అమెరికా ప్రభుత్వంలో చాలా కాలంగా రక్షణ శాఖ ఉన్న పేరును ఇటీవలనే యుద్ధ శాఖగా మార్చి పడేశారు ఆ దేశాధ్యక్షుల వారు. ఎనిమిది, తొమ్మిది దశాబ్దాలుగా అమెరికా రక్షణ శాఖ చేస్తున్నది యుద్ధాలే కదా. అందువల్ల ఆ దేశ రక్షణ శాఖ పేరును యుద్ధ శాఖగా మార్చి వేయడం సబబే అవుతుంది.రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అమెరికా, రష్యాల నేతృత్వంలో రెండు వేర్వేరు ముఠాలు ఏర్పడి సుమారు 50 యేళ్ళ పాటు ప్రచ్ఛన్న యుద్ధాన్ని కొనసాగించాయి. ఈ రెండు ఆధిపత్య ముఠాలకు భిన్నమైన దారి, దృక్పథంతో సమాంతరంగా అలీనంగా కొన్ని దేశాల కూటమి ఒకటి ఏర్పడింది. అమెరికా నేతృత్వంలోని ముఠా, నాటో ముఠాల ఆధిపత్య రాజకీయాల ముందు అలీన కూటమి కొనసాగ లేకపోయింది. సోవియట్ యూనియన్ కూలిపోవడంతో ప్రచ్ఛన్న యుద్ధం అంతమై అమెరికా ప్రత్యక్ష ఆధిపత్యం మొదలైంది. నాటి నుంచి ప్రపంచంపై అమెరికా ముఠా ఆధిపత్యం విపరీతంగా పెరిగి పోయింది. ప్రస్తుత అమెరికా అధ్యక్షుల వారి విచిత్ర వైఖరితో ఐక్య రాజ్య సమితి, భద్రతా మండలి లాంటి సంస్థలు పూర్తి స్థాయి ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. రష్యా, చైనాలు కూడా అమెరికా ఆధిపత్యాన్ని నిలువరించలేక పోతున్నాయి. అమెరికాను ఎవరూ ఎదిరించ లేని దుస్థితిలో ప్రపంచం పూర్తిగా ఏక ధృవ ప్రపంచంగా మారిపోయింది. దాని ఫలితమే ఇరాన్ పై పది రోజులకు పైగా కొనసాగుతున్న యుద్ధం. యుద్ధ ప్రభావాన్ని ప్రపంచమంతా అనుభవిస్తూనే ఉన్నది. ఫలితంగా యుద్ధ పరిశ్రమ చేతి నిండా పని లభించింది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ లు కలిసి చేస్తున్న యుద్ధం ప్రపంచాన్ని ఎటు వైపు తీసుకు వెళ్తుందో ఎన్ని దేశాలను యుద్ధంలోకి లాగుతుందో తెలియడం లేదు. ఇలా మానవ సమాజాన్ని అనవసర యుద్ధాలలోకి లాగి విధ్వంసక ఆయుధాలను విపరీతంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటూ వర్ధిల్లుతున్నదన్న మాట.

గోవర్ధన్ గండె,
9347056621

## రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల



అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయనన్యాయవాది, బహుభాషావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పనిచేసిన తొలితరం కాంగ్రెస్ నాయ కులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజ ల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామ కృష్ణా రావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు.రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు.బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు.1922లో ఆంగ్ల ప్రభుత్వం వారుబీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు.బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు.ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు.హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు.1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మునీషి నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు.

బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్కృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి.పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం-మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్ గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వాఙ్మయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు.ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది.1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494